# పాడిరైతుల పరేషాన్

- పాపిరెడ్డిగూడలోకు పారామెట్ కేటాయింపు
- నెలరోజులు తిరగకుండానే డిప్యూటేషన్
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు



పాపిరెడ్డిగూడ పశువైద్య ఉప కేంద్రం వద్ద పాడిఆవుతో రైతు లక్ష్మయ్య

కేశంపేట, జూన్ 9 : కేశంపేట మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామంలోగల పశువైద్య ఉప కేంద్రంలో పారామెట్ లేకపోవడంతో పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని పశువైద్య ఉప కేంద్రానికి కేటాయించిన పారామెట్ ఏప్రిల్ 15న విధుల్లో చేరుతూ బాధ్యతలను తీసుకున్నారు. తెరవెనుక ఏఎంజరిగిందో తెలియదుకానీ పాపిరెడ్డిగూడ గ్రామానికి కేటాయించిన పారామెట్‌ను డిప్యూటేషన్‌పై మరో ప్రాంతానికి కేటాయిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. పాడి పశువులకు ఏదైనా జబ్బు సోకితే పారామెట్ అందుబాటులో లేకపోవడంతో ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయిస్తున్నామని, పశువులకు సరైన వైద్యం అందక పాడి పశువులు మరింత క్షీణిస్తున్నాయన్నారు. తమ గ్రామానికి కేటాయించిన పారామెట్ స్వప్నను నెలరోజులు తిరగ్గకుండానే డిప్యూటేషన్‌పై షాద్‌నగర్‌కు ఏరియా వెటర్నరీ ఆస్పత్రికి కేటాయించడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. సోమవారం ఈదులపల్లి లక్ష్మయ్య లక్ష్మయ్య రూ.1.20 లక్షలతో కొనుగోలు చేసిన పాడిఆవు అనారోగ్యం బారిన పడడంతో పశువైద్య ఉప కేంద్రానికి తీసుకెళ్లాడు. ఉదయం 9 గంటల నుంచి 12:30 గంటల వరకు వేచి చూసిన ఎవరూ అందుబాటులో లేరని ఆవేదన వ్యక్తం చేశాడు. పశువైద్యాధికారిణికి ఫోన్ చేయగా ఆమె స్పందిస్తూ ఎక్లాస్‌ఖాన్‌పేటకు చెందిన పారామెట్‌ను పాపిరెడ్డిగూడకు పంపించి చికిత్స చేయించినట్లు తెలిపారు. లక్ష్మయ్య 11 గేదెలు, 5 ఆవులు, 3 లేగదూడలు, కోళ్లను పెంచుతూ జీవనం సాగిస్తున్నాడు. 'రూ.60 వేలు పెట్టి కొనుగోలు చేసిన పాడిఆవు అనారోగ్యం బారిన పడడం వల్ల ప్రైవేటు వ్యక్తుల వద్ద ఇంజక్షన్ చేయించాను. దాని ఆరోగ్యం మరింత క్షీణించడంతో రూ.5 వేలకు విక్రయించాల్సి వచ్చింది' అని గ్రామానికి చెందిన కూడల నర్సింహులు వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పాపిరెడ్డిగూడ గ్రామంలో పశువైద్య ఉప కేంద్రానికి పారామెట్‌ను నియమించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### డాక్టర్ ఏమన్నారంటే..

పాపిరెడ్డిగూడ గ్రామంలోని పశువైద్య ఉప కేంద్రంలో పారామెట్ అందుబాటులో లేని విషయమై పశువైద్యాధికారి నివేదితను వివరణ కోరగా ఆమె స్పందిస్తూ పాపిరెడ్డిగూడకు కేటాయించిన పారామెట్ స్వప్నను షాద్‌నగర్‌కు ఏరియా వెటర్నరీ ఆస్పత్రికి డిప్యూటేషన్‌పై కేటాయిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. పశువైద్య ఉప కేంద్రాల్లో మందులు అందుబాటులో లేవనే విషయమై ప్రశ్నించగా గత ఏడాది సెప్టెంబర్‌లో మందులు వచ్చాయని, కొత్తగా పారామెట్లను కేటాయించిన సెంటర్లకు మందులు రాలేదని అన్నారు. వారంలో రెండు రోజులు ఎక్లాస్‌ఖాన్‌పేట పారామెట్, మరో రెండు రోజులు కొండారెడ్డిపల్లికి చెందిన పారామెట్‌తో పాపిరెడ్డిగూడలో విధులు నిర్వహించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

## దివ్యాంగులకు ఉచితంగా ఉపకరణాలు

జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి జయసుధ




దివ్యాంగులతో మాట్లాడుతున్న జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారిని జయసుధ

కొడంగల్, జూన్ 9:దివ్యాంగులకు ఉచితంగా సహాయక ఉపకరణాలు అందిజేస్తామని జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి జయసుధ తెలిపారు.మహిళా శిశు దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ, భారత కృత్రిమ అవయవాల నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో దివ్యాంగులకు సహాయ ఉపకరణాల కోసం ఎంపిక శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్క దివ్యాంగులు సదరం సర్టిఫికెట్, బీపీఎల్ రేషన్ కార్డ్, యుడిఐడి కార్డు, ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని తెలిపారు. అర్హత కలిగిన దివ్యాంగులకు ఉచితంగా సహాయక ఉపకరణాలు అయిన బ్యాటరీ వీల్ చైర్స్, మోటరైజ్డ్ ట్రై సైకిల్స్, హ్యాండ్ ప్రొపైల్డ్,ట్రై సైకిల్స్, వీల్ చైర్స్, హియరింగ్ ఎయిడ్స్ వంటి సహాయక పరికరాలను అందజేస్తామని తెలిపారు. కనీసం 40 శాతం వైకల్యం తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. 154 మంది దివ్యాంగులు వివిధ సహాయ ఉపకరణాల కోసం దరఖాస్తు చేశారని తెలిపారు. కార్యక్రమంలో కొడంగల్ ప్రాజెక్ట్ సిడిపిఓ రజిత, మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించాలి

జాయింట్ డైరెక్టర్ సంధ్య

షాద్‌నగర్‌టౌన్, జూన్ 09: తడి, పొడి చెత్తపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని



తడి, పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న జాయింట్ డైరెక్టర్ సంధ్య

మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ జాయింట్ డైరెక్టర్ సంధ్య అన్నారు. షాద్‌నగర్ మున్సిపాలిటీలో కొనసాగుతున్న 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమాలను సోమవారం మున్సిపల్ కమిషనర్ సునీతారెడ్డితో కలిసి పరిశీలించారు. వార్డులో చేపట్టిన పారిశుధ్య కార్యక్రమాలను, కంపోస్ట్‌యార్డు, వీధి కుక్కల సంతాన నియంత్రణ కేంద్రాన్ని పరిశీలించడంతో పాటు 11వ వార్డులో తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వీధి కుక్కల బారిన పడకుండా తగిన జాగ్రత్తలను తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌ను గద్దె దించితేనే బంజారాల బతుకుల్లో మార్పు

లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్‌నాయక్

షాద్‌నగర్, జూన్ 9 : కాంగ్రెస్‌ను గద్దె దించితేనే బంజారాల బతుకులు మారతాయని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్‌నాయక్ సోమవారం పిలుపునిచ్చారు. మంత్రివర్గంలో లంబాడీలకు స్థానం కల్పించకపోవడంపట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తూ కాంగ్రెస్, రేవంత్ హఠావో.. బంజారా బచావో అనే నినాదాన్ని ఇచ్చి మాట్లాడారు. పదవులను అంటి పెట్టుకొని ఉన్న బంజారా ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీలకు ఏమాత్రం సిగ్గుశరం ఉన్నా వెంటనే తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో అత్యధిక జనాభాగల లంబాడీలకు మంత్రివర్గంలో స్థానం కల్పించకుండా సామాజిక న్యాయం ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. లంబాడీలను కాంగ్రెస్ ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని, రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వ తీరును నిరసిస్తూ తర్వలోనే కారార్యచరణ ప్రకటిస్తామని, బంజారాల ప్రతిఘటన ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు.

## పామాయిల్ రైతాంగానికి కేంద్రం భరోసా

కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్



మాట్లాడుతున్న కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్

ఆదిబట్ల, జూన్ 9: ఫామాయిల్ సాగు చేసే రైతాంగానికి కేంద్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ఆయన పర్యటించారు. ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలోని బొంగులూరు సమీపంలోని కళ్లెం జంగారెడ్డి గార్డెన్ లో నిర్వహించిన వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 29 నుంచి జూన్ 12 వరకు దేశవ్యాప్తంగా వికసిత్ కృషి సంకల్పయాత్ర కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. మూడు ఎకరాల్లో సాగు చేసే రైతు సంవత్సరానికి రూ.3 లక్షలకు పైగా ఆదాయం సమకూరే అవకాశం ఉందని తెలిపారు. టమాట పండించే రైతులకు సైతం కేంద్ర ప్రభుత్వం మార్కెటింగ్ వసతి కల్పించడంతో పాటు రవాణా ఛార్జీలను కేంద్ర ప్రభుత్వమే భరిస్తోందన్నారు. రైతుల నుంచి అభిప్రాయాలను తెలుసుకొని ఒక నూతన ఆవిష్కరణ డాక్యుమెంటేషన్ ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. సందర్శించారు. రాష్ట్రం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ వరి ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ రాష్ట్రం భారతదేశనికే మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని, మైనర్ ఇరిగేషన్కు కేంద్ర నిధులు కేటాయించాలని రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి కేంద్ర మంత్రిని కోరారు. కార్యక్రమంలో రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి శ్రీ భగీరథ్ చౌదరి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి,రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం. కోదండ రెడ్డి, ఐసిఏఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జాట్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఏకే నాయక్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డీకే యాదవ్ పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో దండ మహోత్సవం



చిడా–దహి మహోత్సవంలో పూజలు చేస్తున్న దృశ్యం

మణికొండ, జూన్ 9: పానిహటి చిడా–దహి మహోత్సవాన్ని హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వ ర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నార్సింగి మున్సిపాలిటీలోని కోకాపేట్‌లో సోమవారం నిర్వహించిన మహోత్సవంలో హరేకృష్ణ మూవ్ మెంట్ సత్యగౌర చంంద్రదాస ప్రభుజీ మాట్లా డుతూ.. చిడా–దహి మమోత్సవం గౌడీయ వైష్ణవ సంప్రదాయంలో ఆధ్యాత్మికతకు ప్రాము ఖ్యత గల ఉత్సవం. 500 సంవత్సరాల క్రితం శ్రీ నిత్యానంద ప్రభు ఆజ్ఞతో శ్రీ రఘునాథదాస గోస్వామి పానిహటిలో(బెంగాల్ రాష్ట్రం) అటు కుల అన్నం, పెరుగు, పాలు, పండ్లు, ఇతర భక్తిపూర్వక పదార్థాలతో మహా భోజనాన్ని నిర్వ హించారన్నారు.

## ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా దృష్టి సారించాలి



ప్రజావాణిలో ఫిర్యాదు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, జూన్ 9: ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ అభివృద్ధి పథకాలు ప్రజలకు అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పజావాణిలో జిల్లా ఆదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, ఆర్డీఓ వాసు చంద్రలతో కలిసి ఆయన ప్రజల అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను సత్వర పరిష్కారానికి అధికారులు కృషి చేయాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు, బడిబాట, ధాన్య కొనుగోలు కేంద్రాలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలన్నారు. చౌక ధరల దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మంజూరు అయిన ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ చేసి పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ప్రజావాణిలో 84 దరఖాస్తులు వచ్చాయి.

## హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

ఆదిబట్ల, జూన్ 9: ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో వేసవి సెలవులు ముగిసేసరికి మౌలిక సదుపాయాలు కల్పించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 64 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి విద్యార్థులకు పుస్తకాలు, నోట్ బుక్స్, స్కూల్ యూనిఫామ్స్ అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## 25 వరకు బీఎల్ఓలకు గుర్తింపు కార్డులు పంపిణీ చేయాలి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి




వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జిల్లా అధికారులు

ఆదిబట్ల, జూన్ 9:బూత్ స్థాయి అధికారులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేయాలని, ఈ నెల 25లోగా ప్రక్రియను పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి సూచించారు. సోమవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ 1,200లకుపైగా ఓటర్లు ఉన్న చోట కొత్తగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ఇదివరకు 1500 వరకు ఓటర్లు ఉంటే ఒక పోలింగ్ కేంద్రంగా ఏర్పాటు చేశామన్నారు. కొత్తగా గుర్తించిన పోలింగ్ కేంద్రాలతో కూడిన ప్రతిపాదనల జాబితాను ఈ నెల 20లోగా పంపించాలని కలెక్టర్లకు సూచించారు. అదేవిధంగా అవసరమైన చోట కొత్తగా బూత్ లెవెల్ అధికారులను నియమించాలని, వారు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగా స్థానికులై ఉండాలని, ఒకవేళ అందుబాటులో లేని పక్షంలో అంగన్వాడీ కార్యకర్తలను నియమించవచ్చని తెలిపారు. ఎస్ఎస్ఆర్–2026 ప్రక్రియ కోసం చేపట్టాల్సిన కార్యాచరణ ప్రణాళిక ను రూపొందించుకోవాలని, ఈ నెల 15లోగా తమకు వివరాలు సమర్పించాలని సీఈఓ సూచించారు. డిఆర్ఓ సంగీత, కందుకూరు ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు దుస్తులు అందించేందుకు చర్యలు

జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్




వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఇతర అధికారులు

వికారాబాద్, జూన్ 9: పాఠశాలలు ప్రారంభించేలోగా యూనిఫాంలను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. సోమవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయం నుండి బడిబాట, పాఠశాలలో యూనిఫాంలు, పాఠ్య పుస్తకాల అందుబాటు, ఇందిరా మహిళా శక్తి భవనాలు, సౌర విద్యుత్ ప్లాంట్ల గ్రౌండింగ్, పెట్రోల్ పంపులు ఏర్పాటు, అర్హత ఉన్న మహిళలందరినీ స్వయం సహాయక సంఘాల్లోకి చేర్చుకోవడంతో పాటు కొత్తగా ఎంపికైన గ్రూప్ నాయకులకు జిల్లా స్థాయిలో శిక్షణ, అంగవైకల్యం కలిగిన వారి నిర్ధారణ నిమిత్తం సదరం, యుడిఐ కింద మూల్యాంకనం తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఉన్నతాధికారులతో కలిసి కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని పాఠశాల విద్యార్థులకు అందించేందుకు 65 వేల యూనిఫాంలు అవసరం ఉందన్నారు. ఇప్పటికే 61 వేల యూనిఫాంలు సిద్ధం చేశామన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టరేట్ నుండి అదనపు కలెక్టర్ సుధీర్, డీఆర్డీఓ శ్రీనివాస్, డిపిఓ జయసుధ, డిఇఓ రేణుకా దేవి, వయోజన విద్యాధికారి తదితరులు పాల్గొన్నారు.

# అగ్నిప్రమాదాలపై అప్రమత్తత అవసరం

- హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్
- కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ భవనంలో మాక్ డ్రిల్





అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న సీపీ సీవీ ఆనంద్, అధికారులు. (ఇన్‌సెట్‌లో) మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న సిబ్బంది

సిటీబ్యూరో, జూన్ 9 (నమస్తే తెలంగాణ): బహుళ అంతస్తుల్లో నివాసముంటున్న వారు, విధులు నిర్వహించే వారు.. ఆ భవనంలో అత్యవసర నిష్క్రమణ మార్గాలు, ఫైర్ అలారం, అగ్నిమాపక భద్రతా పరికరాలు ఎక్కడున్నాయో తెలుసుకోవాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ (డీజీ) సీవీ ఆనంద్ సూచించారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్(టీజీఐసీసీసీ) డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి నేతృత్వంలో సోమవారం అగ్నిమాపక శాఖ మాక్ డ్రిల్ నిర్వహించారు. ఇందులో అగ్నిమాపక శాఖతో పాటు ఆరోగ్య శాఖ, మున్సిపల్, హైడ్రా, ఎన్డీఆర్ఎఫ్, ఆర్అండ్‌బీ, విద్యుత్, 108 అంబులెన్స్, వాటర్ వర్క్స్, నగర పోలీస్ విభాగంలోని ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ విభాగాలు పాల్గొన్నాయి.

### అప్రమత్తత అవసరం..

టీజీఐసీసీసీ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి మాట్లాడుతూ.. అగ్ని ప్రమాదం వంటి అత్యవసర పరిస్థితులలో భవనంలో పనిచేస్తున్న ఉద్యోగులను ఎలా సురక్షితంగా కాపాడాలి, స్వచ్ఛందంగా తమను తాముగా ఎలా కాపాడుకోవాలనే విషయాలపై డ్రిల్ నిర్వహించారు. 83.26 మీటర్ల ఎత్తున్న టీజీ ఐసీసీసీ భవనంలో అగ్నిప్రమాదం సంభవించినప్పుడు ముందుగా మంటలను అదుపులోకి తీసుకురావడానికి ప్రయత్నించాలని, అలాగే అందులో ఉన్న సిబ్బంది అగ్నిమాపక భద్రతా సౌకర్యాలకు సంబంధించిన పరికాలు ఎక్కడున్నాయో, ఎలా ఉపయోగించాలనే విషయంలో అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ప్రతి ఫ్లోర్‌లో ఒక ఫైర్ మార్షల్ అతనికి అసిస్టెంట్ నియమిస్తామని అత్యవసర పరిస్తితులలో ఎలా వ్యవహరించాలనే విషయంపై వాళ్లు ఉద్యోగులకు అవగాహన కల్పిస్తారని వివరించారు. ఇలాంటి మాక్ డ్రిల్స్‌ను ప్రతీ నెల మొదటి శనివారం నిర్వహిస్తామని కమలాసన్‌రెడ్డి తెలిపారు.

### అత్యుత్తమ ప్రమాణాలతో టీజీఐసీసీసీ భవనం..

హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. బహుళ అంతస్తుల భవనాలలో ఫైర్ మాక్ డ్రిల్ చాలా ముఖ్యమైందన్నారు. టీజీ ఐసీసీసీ భవనం పూర్తిస్థాయిలో అన్ని రకాల ముందస్తు జాగ్రత్తలు తీసుకొని నిర్మించబడిందని, ప్రస్తుతం 7.5 ఎకరాల స్థలంలో మధ్యలో ఈ భవనం నిర్మించడం వల్ల అత్యవసర పరిస్తితులలో ఫైర్ ఇంజన్లు, 108 వాహనాలు సులభంగా చేరుకుంటాయన్నారు. ఈ భవనానికి ప్రతి టవర్‌కు రెండు ప్రదేశాలలో మెట్లు ఉన్నాయని అన్నారు. కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ లో 2వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని, అత్యవసర సమయంలో లిఫ్ట్‌లు కూడా వాడకుండా, ప్రతి టవర్‌కు ఉన్న రెండు వైపులా మెట్లదారులను ఎంచుకోవాలని సీవీ ఆనంద్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు సీపీ విక్రమ్ సింగ్ మాన్, డీసీపీలు అపూర్వ రావు, పుష్ప, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి వెంకన్న తదితర శాఖ అధికారులు పాల్గొన్నారు.

## రెడ్డి కార్పొరేషన్‌కు నిధులు విడుదల చేయాలి

బంజారాహిల్స్, జూన్ 9: రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసినట్లు జీవో విడుదల చేసి చేతులు దులుపుకున్న ప్రభుత్వం వెంటనే తీరు మార్చుకోకుంటే తెలంగాణ వ్యాప్తంగా ఉద్యమిస్తామని రెడ్డి సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు ఏనుగు సంతోష్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం జూబ్లీహిల్స్‌లో ఏర్పాటు చేసిన రెడ్డి సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర కమిటీ సమావేశంలో సంతోష్‌రెడ్డి మాట్లాడుతూ.. రెడ్డి కార్పొరేషన్‌కు పాలక మండలి ఏర్పాటు చేయడంతో పాటు నిధులు విడుదల చేసేందుకు ప్రభుత్వం చొరవతీసుకోవాలన్నారు. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు టెట్ అర్హత మార్కులు తగ్గించాలని కోరారు. పేద రెడ్డి కులస్తుల సంక్షేమం కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంది తిరుపతి రెడ్డి, కనిమేని చక్రధర్‌రెడ్డి, సుమన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, స్వప్నారెడ్డి పాల్గొన్నారు.

## దివ్యాంగ ఉపకరణాలకు దరఖాస్తుల ఆహ్వానం

సిటీ బ్యూరో, జూన్ 9 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ జిల్లాలోని దివ్యాంగులు సహాయ ఉపకరణాల కోసం18వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్ జెండర్స్ సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు ఏ రాజేందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వికలాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ల సంక్షేమ శాఖ, తెలంగాణ వికలాంగుల సహాయక సమితి ద్వారా ఈ ఉపకరణాలు మంజూరు చేస్తారని అన్నారు. అర్హత కలిగిన దివ్యాంగులు గడువు లోపు దరఖాస్తు చేసుకోవాలని, సందేహాల నివృత్తి కోసం హెల్ప్ లైన్ నెంబర్ 155326ను సంప్రదించాలని ఆయన సూచించారు. హైదరాబాద్ జిల్లాకు రెట్రోఫిట్మెంట్ స్కూటీలు–102, బ్యాటరీ వీల్ చైర్లు–31, మొబైల్ బిజినెస్ బ్యాటరీ ట్రైసైకిళ్లు–41, బ్యాటరీ మినీ ట్రేడింగ్ ఆటో–03, హైబ్రీడ్ వీల్ చైర్లు–10, ల్యాప్‌టాప్‌లు–48, ట్యాబ్‌లు–24, 5జీ స్మార్ట్‌ఫోన్–05, చేతి కర్రలు–53, వీల్ చైర్లు–12, చెవిటి యంత్రం–05, ట్రైసైకిళ్లు–12, స్మార్ట్కేన్స్–25, ఎంసీఆర్ చెప్పులు–25, క్రచెస్–53 కేటాయించారని వెల్లడించారు.

# ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ఫరూఖి

సిటీబ్యూరో, జూన్ 9 (నమస్తే తెలంగాణ): వర్షాకాలంలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖి అధికారులను ఆదేశించారు. సోమవారం మింట్‌కాంపౌండ్‌లోని ప్రధాన కార్యాలయంలో వర్షాకాలంలో ఎదురయ్యే సమస్యలు, తీసుకోవలసిన చర్యలపై వివిధ విభాగాల చీఫ్ ఇంజనీర్లు, ఎస్ఈలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. ఎస్ఈ తమ పరిధిలోని ఫీడర్లలోవిద్యుత్ సరఫరా పరిస్థితిపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, వారానికొకసారి సంబంధిత అధికారులతో సమీక్ష చేయాలన్నారు. అత్యధికంగా అంతరాయాలు నమోదైన ఫీడర్లపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఆయాచోట్ల లైన్ల, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏబీ స్విచ్‌ల తనిఖీలు చేపట్టి, సమస్య పునరావృతం కాకుండా చూడాలన్నారు. ఫీడర్ల అంతరాయాలకు ప్రధానంగా చెట్లకొమ్మలు విద్యుత్ తీగలపై పడటం మూలంగానే ట్రిప్ అవుతున్నట్లు గుర్తించామని, క్షేత్రస్థాయి సిబ్బంది గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని చెట్లు అధికంగా ఉండే ప్రాంతాల్లో విధిగా పెట్రోలింగ్ చేసి తగు చర్యలు తీసుకోవాలని సీఎండీ ఆదేశించారు. వాతావరణశాఖ హెచ్చరికలను పరిగణనలోకి తీసుకోవాలని, సిబ్బంది ఎప్పుడూ కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలని.. వినియోగదారుల ఫిర్యాదులపై తక్షణమే స్పందించి సమస్య పరిష్కరించాలన్నారు. ఎఫ్ఓసీ పరిధిలో ఉండే ఆటోలకు జీపీఎస్ సాంకేతికతను అమర్చామని, దీంతో ఫిర్యాదుదారుడి ప్రాంగణానికి త్వరితగతిన చేరే సదుపాయం ఉందని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సంస్థ ఇన్‌చార్జ్ డైరెక్టర్లు డా.నర్సింహులు, సాయిబాబా, చీఫ్ ఇంజనీర్లు చక్రపాణి, పాండ్య, కామేష్, బాలస్వామి, ఎస్ఈలు పాల్గొన్నారు.